క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సమస్య రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని ఇంద్రవెల్లి విద్యుత్ శాఖ ఏఈ జాదవ్ రోహిదాస్ అన్నారు. మండల కేంద్రంలో అధిక లోడ్ కారణంగా తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో నూతనంగా ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అధికారులకు సహకరించి మెరుగైన విద్యుత్ సరఫరాకు సహకరించలన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సుభాష్, లైన్‌మెన్ లింగన్న, సిబ్బంది మెస్రం మానిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులకు తిప్పలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు సోయాబిన్, మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. చేతికి వచ్చిన పంటలను ఎలా కాపాడుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 25న జరిగే సీపీఎం పార్టీ ఆదిలాబాద్ రూరల్ మండల మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి నెల్ల స్వామి కోరారు. సోమవారం మండలంలోని యాపల్ గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాములు గూడ గ్రామంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలు గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు. సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట రూపకల్పన చేసేందుకే మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసు, విష్ణు, నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

నార్నూర్: క్షేత్రస్థాయిలో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్ అన్నారు. సోమవారం మండలంలోని ఖంపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆశ కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

తలమడుగు: మండలంలోని దేవాపూర్, బరంపూర్, పల్సి(బి) గ్రామాల్లో పత్తి, కంది, ఆయిల్ ఫాం పంటలను కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ శాస్త్రవేత్తలు రాజశేఖర్, సునీల్, శివ చరణ్ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పత్తి, కంది, పంటలో ఆకుముడత, శనగ పచ్చ పురుగు రావడం జరిగిందన్నారు. వీటి నివారణకు లిమ్డా సైహలోథిన్ 800 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. పత్తి కాయలకు బూడిద తెగులు ఎక్కువగా రావడం జరిగిందన్నారు. నివారణకు ఆజోక్సోస్టోబిన్ 200 మిల్లీమీటర్లు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, అనిల్, రైతులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలోని సైద్‌పూర్‌కు చెందిన రాథోడ్ చరణ్‌సింగ్, రాథోడ్ రాజులను కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేసిన తొమ్మిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఈనెల 13న మధ్యాహ్నం 3 గంటల సమయంలో డీజే వాహనంతో ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రామాయి నుంచి ఆదిలాబాద్ వస్తున్న వీరు రోడ్డుపై వ్యక్తులు ఉండడంతో హరన్ కొట్టారు. దీంతో కోపోద్రిక్తులైన తొమ్మిది మంది వీరిపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించారు. బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఆదిలాబాద్ డీఎస్పీ తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. రామాయి గ్రామానికి చెందిన ఏ- 3గా ఉన్న శ్యామ్ బోయిను ఆదివారం అరెస్టు చేయగా, ఏ- 4గా ఉన్న వ్యక్తి జెట్టి అనిల్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అమర పోలీసులకు జోహార్లు

- నివాళులర్పించిన పలు సంఘాలు, పార్టీల నాయకులు



నివాళులర్పిస్తున్న సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: విధుల్లో అసువులు బాసిన అమర పోలీసులకు వివిధ సంఘాలు, ఆయా పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి మౌనం పాటించారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, సురేశ్, నాగరాజు, ప్రభాకర్, బాలకృష్ణ, రంజీత్ రెడ్డిలు నివాళులర్పించారు. అదేవిధంగా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్, గౌరవ అధ్యక్షుడు మేకల మల్లన్న, అసోసియేట్ అధ్యక్షుడు పాశం రాఘవేంద్ర, రఘు, మలపతి సుభాష్ తదితరులు నివాళులర్పించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆ సంఘం అధ్యక్షుడు ప్రమోద్ కుమార్‌ఖత్రి, సంఘ బాధ్యులు రెనీకుంట రవీందర్, సర్సోజి, కందుల రవీందర్, కొత్తపల్లి సంజీవ్, ఎన్నవర్ రాజు, ఉరడే సుభాష్, సత్యం, వేణు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో పోలీసుల అమర వీరుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో పాటు ఆయా పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. సొనాలలోని వివేకానంద పాఠశాలలో పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు మౌనం పాటించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

ఇంద్రవెల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎస్సై దుబ్బక సునీల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి పటేల్ మారుతి డొంగ్రె, నాయకులు అనిల్ రాథోడ్, మీర్జా జీలానిబేగ్, కొరెంగా సుంకట్‌రావ్, ముఖడే ఉత్తం పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోలీస్‌అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్ మండలాల్లో ఎస్సై మనోహర్, సునీల్ పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 5 నుంచి 7 వరకు నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. విద్యార్థుల కోసం భోజన వసతి కల్పించాలని, అతిథులకు ఆహ్వాన పత్రికలు, మరుగుదొడ్లు, తాగునీరు, ఆట స్థలం, కళాజాత కార్యక్రమాలకు కావాల్సిన సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఈఈ భీంరావు, ఉమ్మడి జిల్లాల డీటీడీవోలు, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, అధికారులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటు కోసం పోటాపోటీ

- ముందస్తుగా జెండాలు పాతిన నాయకులు



విగ్రహాల ఏర్పాటు కోసం పాతిన జెండాలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ప్రధాన కూడళ్ల వద్ద మహాత్ముల విగ్రహాల ఏర్పాటు కోసం ముందస్తు జెండాలు ఏర్పాటు చేయడంతో వివాదం మొదలైంది. మండల కేంద్రంలోని బజార్‌హత్నూర్ చౌరస్తాలో కుమురం భీం, అంబేద్కర్ విగ్రహాలున్నాయి. అయితే ఇటీవల డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు పక్కన ఉన్న విగ్రహాలను డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసేందుకు ముందుస్తుగా జెండాలు పాతడం చర్చనీయాంశంగా మారింది. నాలుగు రోజుల క్రితం భీం వర్ధంతి సందర్భంగా ఆదివాసీలు భీం విగ్రహం ఏర్పాటు కోసం జెండాను పాతి, కుమరం భీం ప్లెక్సీ పెట్టారు. సోమవారం దళిత సంఘల నాయకులు కూడా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం ప్రత్యేక పూజలు చేసి మరో జెండా పాతారు. దీంతో లొల్లి మొదలైంది. సోమవారం సాయంత్రం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఇరువర్గాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు పనులు పూర్తయిన తరువాత కలెక్టర్ ఆదేశాల మేరకు విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఎంపీ నగేశ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, నాయకులు ఆరెల్లి రాజలింగు, మరప రాజు, కనక హనుమంత్‌రావ్, కోవ రాజేశ్వర్, దిలిప్ మోరే, దేవ్‌పూజే మారుతి, ఆడావ్ చంపత్‌రావ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ జన్మదినం నేపథ్యంలో సోమవారం ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వేధింపుల నిరోధక చట్టం కమిటీలు ఏర్పాటు చేయాలి

ఇచ్చోడ: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో వేధింపుల నిరోధక చట్టం కమిటీలను ఏర్పాటు చేయాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బి. దాసు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, గిరిజన గురుకుల బాలికల కళాశాలను సందర్శించి మాట్లాడారు. 2013లో కేంద్ర ప్రభుత్వం పని ప్రదేశంలో వేధింపుల నిరోధక చట్టాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న కుమారి, టి రమణ, సత్యనారాయణ, అమృత్‌కుమార్, ప్రిన్సిపాల్ రోజారాణి పాల్గొన్నారు.

కుమురం భీం, సూరుల వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

బేల: మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో సోమవారం కుమురం భీం, కుమురం సూరు 27 వర్ధంతిలను ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ రహదారిపై భారీ ర్యాలీ చేపట్టారు. తర్వాత కుమురం భీం విగ్రహానికి, సూరు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం నందకుమార్, ఆడ శంకర్, కొరంగే జంగ్‌షా, సోనేరావు, కుషాల్‌రావు, కొడప భీంరావు, కాత్లే షేకు, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

30న విగ్రహావిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: ఈనెల 30న భీంపూర్ మండల కేంద్రంలో కుమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని ఆదివాసీ సంఘం నాయకులు కోరారు. సోమవారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి ఆహ్వానించారు. అనంతరం విగ్రహావిష్కరణ కరపత్రాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పాండురంగ్, భీంపూర్ మాజీ సర్పంచ్ లింబాజీ, పురుషోత్తం, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో గల అబిద్ సూపర్ మార్కెట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రోజుమాదిరిగానే సూపర్ మార్కెట్ తెరిచేందుకు రాగా షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకొని చూడగా కౌంటర్‌లో ఉన్న రూ.14వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. సూపర్ మార్కెట్ యజమాని అబిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోవిందా.. గోవిందా...



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల్



శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

ఆదిలాబాద్: గోవింద నామస్మరణతో జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీ వీధులు మార్మోగాయి. కాలనీలోని పురాతన శ్రీవేంకటేశ్వర, శ్రీ గోపాలకృష్ణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు, అమ్మవారి ఉత్సవ మూర్తులతో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రథోత్సవ శోభాయాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పరీక్షను పరిశీలిస్తున్న జీసీడీవో మెస్రం ఛాయ

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. సోమవారం మండలంలోని జామ్డా, మాన్కాపూర్, నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ వన్ పరీక్షలను ఆమె పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినులు నివాసం ఉండే పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు చౌహాన్ వందన, విఠల్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న కొమ్ము కృష్ణకుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హతగల ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకొని పీఆర్టీయూ టీఎస్ అధికారిక అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి టి.నర్సింహస్వామి, సంఘ బాధ్యులు వినోద్ రెడ్డి, లక్ష్మణ్, పిల్లి కిషన్, వెంకట రమణ పాల్గొన్నారు.

'జీవో 29ని రద్దు చేయాలి'



మాట్లాడుతున్న ముడుగు శామ్యూల్

ఉట్నూర్‌రూరల్: అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాల నియామకాలలో ప్రవేశపెట్టిన జీవో 29ని వెంటనే రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాలు లేక విసిగిపోయిన నిరుద్యోగులు కొత్త ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మేలు జరగకుండా ఓసీలకు లాభం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో 29తో ఎంతో నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు రాథోడ్ ఉపేందర్, బండి రాజారాం, రవిత, ప్రకాశ్, రాధా పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



తాంసి: బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ.. ఆడి పాడారు. డీజే పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ.. సందడి చేశారు. అనంతరం వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– తాంసి, తలమడుగు





తలమడుగు: బతుకమ్మ నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు

సంక్షిప్త వార్తలు

సన్మానం

నేరడిగొండ: బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయులను బొందిడి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో 12 ఏళ్ల పాటు మహేందర్, బాలకృష్ణలు విధులు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేశారని కొనియాడారు. ఇక్కడి నుంచి బదిలీ కావడం బాధకరమన్నారు.

- నేరడిగొండ మండల నోడల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పద్మను పీఆర్టీయూ టీఎస్ నేరడిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. బాధ్యతలు చేపట్టిన ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

బజార్‌హత్నూర్: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జీ ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని పిప్రి గ్రామంలో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, జల్కే పాండురంగ్, లింగారెడ్డి, కళ్యం విఠల్, బత్తిని కిషన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కమిషనర్ శుభాకాంక్షలు

కైలాస్‌నగర్: జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఖమర్ అహ్మద్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

మండల పశువైద్యాధికారిగా లావణ్య

తలమడుగు: మండల పశువైద్యాధికారిగా లావణ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన పశువైద్యాధికారి దూదూరం రాథోడ్‌తో పాటు లావణ్యను తహసీల్దార్ రాజ్‌మోహన్, మాజీ జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకట్ రావ్, రవికాంత్, రమేశ్‌రెడ్డి, వెంకటి యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కైలాస్‌నగర్: పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంజీవ్ రావు, కార్యదర్శిగా దుర్గయ్య, కోశాధికారిగా రాందాస్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ నియమాక పత్రాలు అందజేశారు. శాలువాతో సత్కరించి వారిని అభినందించారు.

కేసులు నమోదు చేయడం సరికాదు

ఎదులాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగితే కేసులు పెట్టడం, ప్రశ్నిస్తున్న గొంతులను అణచి వేసేందుకు యత్నించడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఇజ్జగిరి నారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలువార్డుల్లో కేటీఆర్ సభకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. మూసినదిపై జరుగుతున్న అవినీతిపై ప్రశ్నించినందుకు కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాజ్ సిద్ధార్థ్, అనిల్, కార్తీక్, అరవింద్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.